# 13

# క్రైస్తవ్యం శ్రేష్ఠమైనది

## (7:1-28)

హెబ్రీ పత్రికలో "శ్రేష్ఠమైనది" అను మాటను పలుమార్లు చూస్తుంటాము. క్రైస్తవులకు ప్రధాన యాజకుడుగాని, ఆలయంగాని బలులుగాని లేవు. కాబట్టి క్రైస్తవ్యం యూద మతంకంటే తక్కువస్థాయి కలదని యూదా క్రైస్తవులు ఆరోపించబడియుండవచ్చు. అందుకే "క్రైస్తవులుగా మీరు దీనిని వదులుకోవాల్సిన అవసరం లేదు. మీకు *గొప్ప* ప్రధాన యాజకుడున్నాడు, *గొప్ప* ఆలయం ఉంది, *గొప్ప* బలులు ఉన్నాయి. క్రైస్తవ్యంలోని ప్రతిదీ *గొప్పదే!*" అని గ్రంథకర్త సూచిస్తున్నారు.

దీనికి ముందున్న పాఠములో మనం హెబ్రీయులకు 7వ అధ్యాయమును ధ్యానం చేస్తూ వచ్చాము. యేసు ప్రధానయాజకత్వం గొప్పది అన్న ప్రాథమిక సందేశమును 7వ అధ్యాయములో చూశాము. ఇది నిజం. ఎందుకంటే, "మెల్కీసెదెకు క్రమము చొప్పున యేసు ప్రధాన యాజకుడు" (6:20) "మెల్కీసెదెకు క్రమము చొప్పున యాజకుడు" అంటే ఏమిటో మనం చూశాము. ఇదే గాక 7వ అధ్యాయంనుండి నేర్చుకోదగ్గది ఇంకా ఉంది. పత్రికలోని కొన్ని అంశములను మరియు వాటి గురించిన ముక్తాయింపులను అధ్యాయం చివరి భాగంలో చూస్తున్నాము. ఈ పాఠములో 7వ అధ్యాయమును మరోసారి పరిశీలించి నేర్చుకోదగ్గ పాఠములను అన్వయించుకుందాము.

### *గొప్ప* ప్రధానయాజకుడు యేసు

ఇప్పుడు చెప్పుకున్న ప్రకారం, లేవీ యాజకత్వంకంటే, యేసుని ప్రధానయాజకత్వం శ్రేష్ఠమైనది అన్న సత్యం 7వ అధ్యాయములో కనబడుతుంది. యేసు లేవీ గోత్రమునుండి రాలేదు కాబట్టి ఆయన ప్రధానయాజకుడు కాలేడని యూదులు వాదించవచ్చు (చూడు 14 వ.), కానీ యేసు మరో గోత్రం నుండి రావడం అనేది ఆయనను ప్రధాన యాజకత్వమునకు అనర్హునిగా చేయదు అని గ్రంథకర్త చూపిస్తున్నాడు. యేసు ప్రత్యేకంగా ఉన్నవాడై, సంపూర్ణుడు కాబట్టి ఆయన ప్రధాన యాజకత్వం శ్రేష్ఠమైనది అని గ్రంథకర్త స్పష్టం చేస్తున్నాడు (28 వ.); ఆయన రాజు, నిత్యుడు. మనలను రక్షించుటకు *నిత్యము* జీవించుచున్నవాడు (25 వ.).

### క్రైస్తవ్యంలోని ప్రతిదీ *శ్రేష్ఠమైనది*

#### *అప్పుడు దీని అర్థం ఏమిటి?*

క్రైస్తవ్యంలో గొప్ప ప్రధాన యాజకుడు ఉన్నాడన్న సత్యమును ఆధారం చేసుకుని గ్రంథకర్త క్రైస్తవ్యంలోని *ప్రతిదీ* గొప్పది అని తెలియజేస్తున్నాడు. ప్రత్యేకించి "శ్రేష్ఠమైన నిరీక్షణ" (19 వ.) మరియు "శ్రేష్ఠమైన నిబంధన" గురించి (22 వ.; చూడు 8:6) అతడు తెలియజేస్తున్నాడు. అలాగే క్రైస్తవ్యంలో శ్రేష్ఠమైన బలులు (7:27; చూడు 9:23) మరియు శ్రేష్ఠమైనది గుడారం

(8:2) ఉన్నాయని సూచిస్తున్నాడు. ఈ విధంగా, క్రైస్తవ్యం, యూదామతం కంటే ఏ మాత్రం తక్కువకాదని తన యూదా క్రైస్తవ చదవరులను గ్రంథకర్త ప్రోత్సహిస్తున్నాడు.

**ఇప్పుడు దీని అర్థం ఏమిటి**

ఈ సత్యమును మనకు ఇప్పుడు అన్వయించుకోవచ్చా? అవును. తన పాఠకులు ఎక్కడున్నారో అక్కడినుండే గ్రంథకర్త ప్రారంభిస్తున్నాడు; మనమూ అదే చేయాలి. క్రైస్తవ్యం అనేది యూదామతం కంటే తక్కువ స్థాయి కలది అని మనకెవరూ ఈనాడు చెప్పడం లేదు గానీ ఈనాడు లోకం అందిస్తున్న అవకాశాల కంటే క్రైస్తవ్యం అందిస్తున్నది తక్కువే అని మనం చెప్పబడుతున్నాము. ఒక వ్యక్తి జీవితమును ఆనందించాలంటే, మనకు పేరు ప్రఖ్యాతులు రావాలంటే, విజయవంతం కావాలంటే, అతడు యేసుని బోధనలు గాక ఈ లోకపు విధానాలను అనుసరించాలని చెప్పబడుతున్నాము. ఒకవేళ హెబ్రీ గ్రంథకర్త మనకే పత్రికను వ్రాయదల్చుకుంటే ఈ లోకం అందిస్తున్న అవకాశాలు, విధానాల కంటే *క్రైస్తవ్యం అందిస్తున్నది ఎంతో శ్రేష్ఠమైనది* అని వ్రాసియుండేవాడు. ఉదాహరణకు, ఈ లోకం *తాత్కాలిక* విజయం, సంతోషం, ఆనందం అందిస్తుండగా క్రైస్తవ్యం మాత్రం నిత్యమైన విజయం. ఆనందం సంతోషాన్ని అందిస్తుంది (చూడు 7:25; 11:24-26).

---

**ఉపదేశకులకు సూచనలు**

పునఃసమీక్ష మరియు చర్చ నిమిత్తం ఈ పాఠం ఇయ్యబడింది. మొదటి భాగంలో మునుపు చెప్పిన సత్యములను మరియు రెండవ భాగంలో క్రైస్తవ్యం శ్రేష్ఠమైనది అన్న సత్యమును పునఃసమీక్షించండి. విద్యార్థులకు అన్వయించేతప్పుడు ఈ లోకం చెప్పే అబద్ధాలను గురించి అడగండి ("మీరు క్రైస్తవులయితే, సుఖం, సంతోషాలు ఉండవు" వంటి మాటలు). మీ దగ్గర ఒక నల్ల బోర్డు లేదా ఒక పేపరు ఉంటే, వీటిని ఎడమచేతివైపు వ్రాయండి. తరువాత కుడి చేతివైపు క్రైస్తవ్యం విషయంలో ఏది సత్యమో దాన్ని వ్రాయండి. ఈ అభ్యాసం చేయడం, చేయించడం ద్వారా క్రైస్తవ్యం, లోకంలోని *సమస్తం కంటే* గొప్పది అన్న విషయం విద్యార్థుల మనస్సుల్లో స్థిరంగా ఉండిపోతుంది.

నేనుంటున్న ప్రాంతంలో, క్రైస్తవులు ప్రాథమికంగా ఈ లోకంనుండే ఆకర్షణల సవాలును ఎదుర్కొంటున్నారు. మీరుంటున్న ప్రాంతంలో ఒక వాదం లేదా మతం క్రైస్తవ్యం కంటే గొప్పదని చెప్పబడుతుండవచ్చు. అటువంటి పక్షంలో క్రైస్తవ్యం మరియు ఆ మతమునకు మధ్యగల పోలికను చేర్చి చూపండి.